# చిత్రసఖీయం

★ ప్రియశ్రీ ★

## 1

తెల్లవారితే సుబ్రమణ్యం ఇంట్లో పెళ్ళి. అందులోనూ బాల్యస్నేహితుడు కూడానూ. ఐనా ఈ సమయానికే ఆఫీసులో ఇంత పని రావాలా? పోనీ అడిగిచూద్దాం అని మేనేజరుని అడిగేడు శంకరం. అనుకున్నంత అయింది. మొహం వేళ్ళాడేసుకు చక్కావచ్చాడు. మనసులో గాబరా. స్నేహితుడింట్లో పెళ్ళికి వెళ్ళకపోతే బావుండదు అనిపిస్తోంది.

చటుక్కున జ్ఞాపకం వచ్చింది సుబ్రమణ్యం ఉంటున్న ఊరు తనభార్య పుట్టింటారింటికి మూడు మైళ్ళదగ్గరలో వుందని. భార్యని పిలిచి ఇలా అన్నాడు "లక్ష్మీ! నా క్లాస్‌మేట్ సుబ్రమణ్యం యింట్లో రేపే వివాహం. నాకు ఆఫీసులో సెలవు దొరకలేదు. మరి వెళ్ళకపోతే బావుండదు. మరీమరీ నొక్కినొక్కి రాసేడు తప్పకరావాలని. అంచేత మీవాళ్ళఊరికి వాళ్ళ ఊరు మూడు మైళ్ళే దూరం గనుక నువ్వు వెళ్ళి మీతమ్ముణ్ణెవర్నైనా సాయంతీసుకుని సుబ్రమణ్యం యింటికి వెళ్ళు. నాకు తీరికలేని పని వుండడంచేత రాలేక పోయానని చెప్పు."

తన పుట్టింటారింటికి వెళ్ళొచ్చుగదా అని సంతోషించి శంకరం చెప్పినట్లు అంగీకరించింది లక్ష్మి. అప్పుడే గడియారం 8 గం॥ కొట్టింది. తొమ్మిదిగంటల ప్యాసింజరుకి బయలుదేరితే సుమారు మధ్యాహ్నం నాల్గుగంటలకు వెళ్ళిపోవచ్చు తనతండ్రిగారి ఊరు. తన చిన్న తమ్ముడు వేణూ తనూ కలసి పెళ్ళివారింటికి వెళ్ళొచ్చు అనుకుంది లక్ష్మి.

"మరి త్వరగా తయారవ్వు అరగంటలో స్టేషనుకి వెళ్ళిపోవాలి" అని శంకరం బండితీసుక రావడానికి వెళ్ళి పోయాడు.

లక్ష్మి ట్రంకుపెట్టెలోంచి సిల్కుచీర తీసింది. ఆచీరకింద ఓ పదిరూపాయల నోటు కనబడింది. అది తన తండ్రికి తెలియకుండా తన తల్లి తనకు సంక్రాంతినాడిచ్చింది. రైలు ఖర్చులకైనా పనికొస్తుందని తన హాండ్‌బ్యాగ్‌లో భద్రపరచింది.

శంకరం తిరిగి వచ్చేటప్పటికి లక్ష్మి సిద్ధంగా వుంది. యీలోపుగా ఆఫీసునుంచి ప్యూనువచ్చి మేనేజరుగారు అర్జంటుగా రమ్మనారని చెప్పి వెళ్ళిపోయాడు. రైలుకు వేళ అయిపోతోంది.

"అదిగో విన్న అందినజీతం ఆ కోటు పక్కజేబులో పెట్టాను. వాట్లో ఓ ఐదు పదిరూపాయల నోట్లు తీసుకుని సుబ్రమణ్యం కూతురు పెళ్ళిలో పెళ్ళికూతురికి కట్నం చదివించు మర్చిపోకుసుమా. మరి నేనిక స్టేషనురావడానికి వీల్లేదు. ఆఫీసునుంచి అర్జంటు కబురు వొచ్చింది. బండి వీధిలోవుంది. తాళాలు యింటికి వేసేసి పక్కింటి నరసమ్మగారి కియ్యి" అని చెప్పి సైకిలెక్కి వెళ్ళిపోయాడు శంకరం.

తను తలుపులు తాళాలువేసి వాళ్లింటికి వెళ్ళి యిచ్చి తిరిగివచ్చేటప్పటికి అప్పుడే రైలుకి ఇరవై నిముషాలుంది. ఈ ఆడవాళ్ళెప్పుడూ ఆలస్యమేనని బండివాడు కేకవేస్తున్నాడు. కంగారుగా బండెక్కి వెళ్ళిపోయింది లక్ష్మి.

## 2

ఆ మర్నాడు మధ్యాహ్నం పన్నెండుగంటల వేళ.

లక్ష్మి త్వరగా టిక్కెట్టు కొనుక్కుని చేత్తో సంచీ పట్టుకుని రైలుపెట్టెలో ప్రవేశించింది. ఆ పెట్టెలో ఒక యువతి కూర్చునివుంది. ఆమె ముఖంలో దైన్యరేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమె వస్త్రధారణ బట్టి ఆమె భర్తృహీనయని తెలుస్తోంది. తైలసంస్కారంలేని

ఆమె ముంగురులు గాలికి అటూయిటూ ఎగురుతున్నాయి సుమారు ముప్పయి సం॥ లుంటాయి.

"ఎందాకవెళ్తారు" అని లక్ష్మితో సంభాషణ ప్రారంభించింది ఆ కూర్చున్న యువతి

"బెజవాడదాకా నండి" అంది లక్ష్మి

"బెజవాడంటారేమిటండోయి విజయవాడనాలండీ" అంది కూర్చున్న యువతి నవ్వుతూ

"ఏదో అలవాటయి పోయిందండీ" అందిలక్ష్మి

ఇద్దరుస్త్రీలు ఒకచోటచేరితే కబుర్లకుకొదవా. లోకాభి రామాయణం మొదలుపెట్టారు రాజకీయాలు, సినిమాలు, కంట్రోళ్ళు - ఒకటేమిటి వాళ్ళసంభాషణలో అన్నివిషయాలూ దొర్లిపోయాయి. క్షణమాత్రంలో ఆయువతులిద్దరు గాఢస్నేహితురాండ్రవలె కబుర్లు చెప్పుకోడం ప్రారంభించారు.

వారిసంభాషణ వలన, ఆయువతిపేరు రవణ అనీ బాల్యంలోనే వైధవ్యం అనుభవింప వలసి వచ్చిందనీ తెలుస్తుంది, ఆమె మూడవఫారం వరకూ చదవడం మూలాన విజయవాడలో ట్రెయినింగ్ ప్యాసయి గరల్సు స్కూలులో ఉపాధ్యాయినీ వృత్తిచేసుకుంటూ ఏచీకూ చింతా లేకుండా సుఖంగా కాలాక్షేపం చేస్తోంది. ఏదోపనివుండి అలావిజయనగరం వెళ్ళిమళ్ళీ తిరిగివచ్చేస్తోంది.

హిగిన్ బాథమ్సు బుక్‌స్టాలునుంచి బోయ్ పత్రికలు పట్టుకువచ్చి అమ్ముతున్నాడు. లక్ష్మికి పత్రికలంటే చాలసరదా అందులోనూ మంచి మంచి బొమ్మలున్న సినిమాపత్రికలంటే మరీ యిష్టం. కొన్నిపుస్తకాలుకొంది.

"డబ్బెక్కువగా ఉందేమండీ. ఈలాటి అనవసరపు ఖర్చులు చెయ్యడం" అందిరవణ.

"ఏమండీ మగవాడు తనయిష్టం వచ్చినట్లు డబ్బు తగలెయ్యవచ్చా! చూడండీ! ఎక్కడో స్నేహితుడి పెళ్ళట. యాభయి రూపాయిలు చదివించమని యిచ్చారు. స్నేహితులెళ్ళలో జరిగే పెళ్ళిళ్ళ కన్నిటికీ యిలాడబ్బు తగలేస్తూంటే సంసారం సాగుతూందా ఈకరువురోజుల్లో. ఎప్పుడేనా ఓపుస్తకం కొనమంటే డబ్బుదండుగంటారు ఇలా స్నేహితులకుతగలేస్తే డబ్బుదండుక్కాదు కాబోలు" అని భర్తమీద కోపంఅంతా ఆవిడ దగ్గరవెళ్ళబోసుకుంది.

ఇదేమిటి వాగేస్తున్నాను నోటికొచ్చినట్లు అనుకుందిగాని మళ్లీ నిముషంలో అదంతా మర్చిపోయి పత్రికలోవి బొమ్మలు తిరగేస్తూ రవణతో కబుర్లు చెప్పడం మొదలుపెట్టింది.

"పెళ్లి బాగా జరిగిందా" అంది రవణ

"ఏం పెళ్ళండీ బాబూ ముందర నా పెళ్లయింది. తీరా చేలగట్లమ్మట పుట్లమ్మట నడచి మా పుట్టింటూరి వూరువెళ్లి పెళ్లివారింటికి మా బుల్లితమ్ముణ్ని తీసుకువెళ్లితే పెళ్లి ఆగిపోయిందన్నారు. పెండ్లివారి గోత్రాలు ఒకటే అయ్యాయిట, ఆమాత్రం ముందు వెనకా చూసుకోవద్దటండీ ఆ సుబ్రహ్మణ్యంగారు "అమ్మా క్షమించండి. పెళ్లి దురదృష్టంవల్ల ఆగిపోయింది శ్రమపడి వచ్చేరు. శంకరంకు పాపం సెలవు దొరకలేదు వాడికి నా మీద ప్రేమగనకే మిమ్మల్ని పంపించాడు ఈ వాళ్టికి మాయింట్లో భోంచేసి రేపు వెళ్ళుదురుగాని" అన్నా డాయన నిక్క వినయంతో"

"ఏం భోంచెయ్యకుండా వచ్చేసారా ఏమిటి కొంపదీసి" అంది రవణ.

"ఆ! ఇంకా వాళ్లింట్లో విస్తరి వెయ్యడం కూడానా! "క్షమించండి. నాకే ఫర్వాలేదు. నన్ను యిబ్బంది పెట్టొద్దు. త్వరగా యింటికి వెళ్లిపోవాలి. మళ్లీ ఎప్పుడేనా వచ్చినప్పుడు మీరు వెళ్లమనేదాక వుంటాను." అని మంచిగా జారుకున్నాను అక్కణ్నుంచి.

"ఎంతపని జరిగిందీ మీ యాభయిరూపాయలు మీకు దక్కాయిగదా" అంది నవ్వుతూ.

## 3

రైలు ఓ స్టేషన్లో ఆగింది. లక్ష్మి స్నేహితురాలొకతె ఆస్టేషనుప్లాట్‌ఫారంమీదనిలబడివుంది.

లక్ష్మి ఆమెనుచూచి పరుగెత్తుకు రైలుదిగి వెళ్లి పోయింది ఆమెతో సంభాషించడానికి.

తిరిగివచ్చేటప్పటికి రవణ యిలా అంది "చూడండీ ఎప్పుడేననారే మీ సంచీ అలా వది లేసి వెళ్లకూడదు. ఒకవేళ నేను దొంగనే అవుతా ననుకోండి అప్పు డేం జరుగుతుందో తెలుసా. నేనుగనక సరిపోయింది ఏమంటారు. అందుచేత మీ సంచీని విడిచివెళ్లకూడదని చెప్తున్నాను."

"దానికేం లెండి తొందరలో పొరపాటుగా తీసికెళ్ళడం మర్చిపోయాను కామోసు. మీలాంటి వాళ్లదగ్గర అటువంటివేమి లెందుకు జరుగుతా యండీ" అంది లక్ష్మి.

మళ్లీ వారు యధాప్రకారంగా కబుర్లు చెప్పు కోడం ప్రారంభించారు.

రైలు ఇంకో పెద్దస్టేషన్లో ఆగింది. వేసవి కాలం కావడంచేత రవణకు గొంతుక ఎండి పోతూంది.

"కాస్త మంచినీళ్లు తాగివద్దాం, వస్తారా!" అంది రవణ. "నాకు దాహంగా లేదండీ" అని తప్పించుకుంది లక్ష్మి.

ఆమె మనస్సులో ఏవేవో ఆలోచనలు పరు గెడ్తున్నాయి. తనభర్త తన స్నేహితుడికూతురు పెళ్లికి యాభయిరూపాయలు చదివించమని తన కిచ్చాడని రవణతో చెప్పడం - ఆమె పోనీలెండి మీ యాభయిరూపాయలు మీకు దక్కాయిగదా అని అనడం - ఒకవేళ నేను దొంగనవుతే అప్పు డేమవుతుందో చూడండీ అనడం - ఇవన్నీ ఆమె మనస్సులో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆమె కేదో గబుక్కున ఆలోచన తట్టింది. తన సంచిలోని సామానంతా బల్లమీద పోసింది. డబ్బా ఒకటి రాలింది. ఆ డబ్బా విప్పింది. అందులో యాభయి రూపాయల్లేవు. పనీ పర్సులోమాత్రం కొంత చిల్లరవుంది. తను యాభయిరూపాయలు శంకరం కోటుజేబులోంచి తీసి ఈ డబ్బాలో పెట్టిందే! ఏమవుతాయి. ఆమె హృదయంలో అనుమానబీజాలు మొలకలెత్తడం ప్రారంభించాయి. నెమ్మదిగా రవణ ట్రంకుపెట్టె దగ్గరకు వెళ్లింది. అదృష్టవశాత్తూ దానికి తాళాలు తీసున్నాయి నెమ్మదిగా తలుపు తెరిచింది. కొన్ని చీరలు తీసేటప్పటికి ఓ చీరె మడతలో ఐదు పదిరూపాయలనోట్లు కనిపించాయి. ఆమె వాటిని తీసుకొని తన సంచిలో దాచింది. ట్రంకు తలుపు వేసేసింది

ఈ విషయం రవణతో చెప్పుదామా మాన్దామా అనుకొని చివరకు చెప్పగూడదని నిశ్చయించు కుంది

ఆమె హృదయంలో రవణని కొన్నివేల తిట్లు తిట్టింది. రవణ మళ్లీ కంపార్టుమెంటులోకి తిరిగి వచ్చింది. తెచ్చిపెట్టుకున్న నవ్వుతో మళ్లీ రవ ణతో మాట్లాడింది లక్ష్మి విజయవాడ స్టేషను దగ్గర ఆగింది ప్యాసింజరు. లక్ష్మి దిగి చరచరా నడచివెళ్లి ఒక రిక్షాకట్టించుకు వెళ్లిపోయింది. ఆమె అంతతొందరగా వెళ్లిపోవడం రవణకు అర్థం గాలేదు

శంకరం లక్ష్మిని పెళ్లిగురించి అడిగాడు. పెళ్ళి విషయాలన్నీ చెప్పింది లక్ష్మి. శంకరం లక్ష్మితో "నిజంగా పెళ్ళిగాని ఆగకుండా అయి పోతే నా పరువు నాశనం చేద్దువు. నీవు కోటు జేబులో ఏభయిరూపాయలు తీసుకెళ్లమంటే అవి అద్దందగ్గర బల్లమీదవుంచి వెళ్లిపోతావా- నీదగ్గర 10 రూ ఉన్నాయని నాకు తెలుసులే. దానితో రైలుఖర్చులూ అవీ సరిపెట్టావా- నా స్నేహితుడు కూతురు పెళ్ళికి నేను ఆమాత్రం చదివించకగనా నీ కిష్టం లేకపోతే చదివించవద్దని చెప్పలేక పోయావా? మా గొప్పపని చేసేవులే" అన్నాడు.

ఆమె తల తిరిగిపోయింది గబగబా పరుగెత్తి పరుపుమీద పడుక్కుని తలగడలో తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది. శంకరం ఆమెను లేవదీసి చూచేటప్పటికి ఆమె కళ్ళనుండి అశ్రువులు జలజల రాలుతున్నయ్!